




బింబం... ప్రతిబింబం

పెనుమూరు మండలం కలవగుంటలోని ఎన్టీయార్ జలాశయంలోదీ సుందర దృశ్యం.




జలపాత ఝరులు

తుపాను వానలకు శేషాచలంలో కురిసిన వానలు వాగులై వంకలై పారి జలపాతాలుగా మారి దూకుతున్నాయి. తిరుపతిలోని గరుడవారధి మీద నుంచి మాలాడగుండం, కపిలతీర్థం జలపాతాలు నయనమనోహరంగా కనిపిస్తున్నాయి. శేషాచలం సిగలో ఈ జలవంకల సొగసు తిరుమలకు వచ్చే భక్తులనూ, తిరుపతి వాసులనూ మురిపిస్తోంది. మంగళవారం ఉదయంనాటి ఈ కమనీయ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తిరుపతి ఫొటోగ్రాఫర్ అందిస్తున్నారు.





నిండిన జలాశయాలు



బంగారుపాళ్యం మండలం జంబువారిపల్లెలో నిండిన వెంకటప్పనాయని చెరువు

- కళకళలాడుతున్న చెరువులు
- పొంగిపొర్లుతున్న వాగులు

చిత్తూరు సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రప్రదేశ్):తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో జిల్లాలోని జలాశయాలన్నీ నిండాయి, చెరువులు మొరవ పోతుండగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చాలా చోట్ల రహదారులు కోతకు గురవగా, వంకదార్లు కొట్టుకుపోయాయి. దీంతో ప్రజల రాకపోకలకు చాలా చోట్ల ఇబ్బందులు ఏర్పడ్డాయి. పెనుమూరు మండలం కలవగుంటలోని ఎన్టీయార్ జలాశయం (కెపాసిటీ 0.104 టీఎంసీలు), కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం జలాశయం (కెపాసిటీ 0.89 టీఎంసీలు) జలాశయాలు పూర్తిగా నిండడంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువప్రాంతానికి వదిలారు.వర్షాలతో 250 చెరువులు పూర్తిగా నిండగా, 1400 చెరువుల్లో 75 శాతం, మిగిలిన చెరువుల్లో 50 శాతం వరకు నీరు చేరాయి. నీవానది ప్రవహించే కలిజవేడు - కొట్రకోన, ఆత్మకూరు - నరసింగరాయనిపేట తదితర ప్రాంతాల్లో రాకపోకలను తాత్కాలికంగా ఆపివేశారు. గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లె పంచాయితీ అరవచేను - గొల్లపల్లెకు వెళ్లే రహదారిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వంకదారి తెగిపోయింది. ఐరాల- చిత్తూరు రహదారిలో ప్రవహిస్తున్న జిల్లేడుబుగ్గ వంకలో భారీగా నీరు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.శ్రీరంగరాజపురం మండలంలో జీఎంఆర్‌పురం, పాతపాళ్యం, సింధురాజపురం, ఎగువకమ్మకండ్రిగ వాగు ఉధృతంగా ప్రవహిస్తోండడంతో 20 గ్రామాలకు రాకపోకల్లేకుండా అధికారులు బారికేడ్లను పెట్టారు. ఐరాల మండలంలో గార్గేయనది వుధ్రుతంగా ప్రవహించడంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంకపైన ప్రజలను అటు, ఇటు పోనివ్వకుండా బారికేడ్లను పెట్టారు. సాయంత్రం ప్రవాహం తగ్గడంతో పోలీసులు రాకపోకలకు అనుమతించారు. పాలసముద్రం మండలంలో చిత్తూరు-బలిజకండ్రిగ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మహదేవపురం,రాచపాళ్యం కోన కాలువ,మఠవలం కాలువల ప్రవాహంతో చిత్తూరు-షోళింగర్ ప్రాంతాలకు మంగళవారం మధ్యాహ్నం దాకా రాకపోకలు ఆగిపోయాయి.



చిత్తూరు - ఐరాల మార్గంలో వుధ్రుతంగా ప్రవహిస్తున్న జిల్లేడుబుగ్గ వంక



వెదురుకుప్పం-దేవళంపేట మార్గంలోని తంగేలిమిట్ట సమీపంలో ఉన్న మధ్యల వంకలో విద్యార్థులను వాగు దాటిస్తున్న స్థానికులు

ఆగిన వాన

- పూతలపట్టులో 87.8 మి.మీ వర్షపాతం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురిసిన వర్షాలు మంగళవారం తెరపిచ్చాయి.దీంతో జనజీవనం సాధారణ స్థితికి చేరుకుంది. ప్రాణనష్టం లేకపోయినా ఫెంగల్ తుపాను పంట నష్టాలను మిగిల్చింది.సోమవారం ఉదయం 8 గంటల నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకు పూతలపట్టులో అత్యధికంగా 87.8మి.మీ వర్షపాతం నమోదయ్యింది. అత్యల్పంగా గుడుపల్లెలో 4.0 మిమీ వర్షం కురిసింది. మండలాలవారీగా పెనుమూరులో 80.4మి.మీ, పాలసముద్రంలో 78.4, యాదమరిలో 67.8, శ్రీరంగరాజపురంలో 67.2, గంగాధరనెల్లూరులో 61.8, పులిచెర్లలో 61.2, తవణంపల్లెలో 58.2, ఐరాలలో 57.6, చిత్తూరు రూరల్‌లో 56.6, రొంపిచెర్లలో 52.4, సదుంలో 44.2, చిత్తూరులో 33.4, సోమలలో 30.8, చౌడేపల్లిలో 28.4, కార్వేటినగరంలో 28.2, బంగారుపాళ్యంలో 27.8, విజయపురంలో 24.6, నగరిలో 22, వెదురుకుప్పంలో 21, గుడిపాలలో 20.2, పలమనేరులో 19.4, నింద్రలో 17.6, బైరెడ్డిపల్లిలో 14, పుంగనూరులో 12.8, పెద్దపంజాణిలో 11.8, గంగవరంలో 11.6, వి.కోటలో 11.4, రామకుప్పంలో 10.2, శాంతిపురంలో 6.8, కుప్పంలో 4.4 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

679 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా దెబ్బతిన్న ఉద్యాన పంటల నష్టం 679 ఎకరాలకు చేరింది. తొలిదశలో 20 గ్రామాల్లోని 132 మంది రైతులు 184 ఎకరాల్లో సాగు చేసిన ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు లెక్కలు కట్టారు. మంగళవారం పంటల నష్టం అంచనాలు మరింత పెరిగాయి. తాజాగా కుప్పం, శాంతిపురం, బైరెడ్డిపల్లె, వి.కోట, పులిచెర్ల, చౌడేపల్లె, సోమల, రొంపిచెర్ల, సదుం,పుంగనూరు, గంగవరం, విజయపురం, ఎస్‌ఆర్‌పురం, కార్వేటినగరం, వెదురుకుప్పం, పాలసముద్రం మండలాల్లోని 67 గ్రామాల్లో 283 మంది రైతులు 495 ఎకరాల్లో సాగు చేసిన ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. టమోటా 142 ఎకరాలు, ఉర్ల 197, వంకాయ 27, మిరప 41, కాకరకాయ 49, బీన్స్ 15 ఎకరాల్లో పంట దెబ్బతినింది. దీంతో ఇప్పటివరకు మొత్తంగా 87 గ్రామాల్లో 415 మంది రైతులు 679 గ్రామాల్లో సాగుచేసిన ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు.

చేపలు పట్టేందుకొచ్చి...



చిరంజీవితో పోలీసులు, యువత

నగరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరిలో స్థానిక యువత, పోలీసులు కలిసి ఓ మత్స్యకారుడిని కాపాడారు. వెదురుకుప్పం మండలానికి చెందిన ఎర్రగుంటపల్లె ఎస్టీకాలనీకి చెందిన చిరంజీవి(60) చేపలు పట్టడానికి నగరికి వచ్చాడు. కుశస్థలీనది వద్ద ఉన్న బ్రిడ్జి కింద చేపలు పడుతుండగా కృష్ణాపురం రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో ఉధృతంగా వచ్చిన ప్రవాహంలో కొట్టుకుపోతూ ఓ చెట్టును పట్టుకుని వేలాడుతుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.సీఐ మహేశ్వర్ తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. అక్కడున్న యువతతో కలిసి చిరంజీవిని కాపాడారు.

హంద్రీనీవాకు రూ.516 కోట్లు

- పుంగనూరు, కుప్పం బ్రాంచి కాలువల లైనింగ్ పనులకు మంజూరు
- అనంతపురం జిల్లాలో పుంగనూరు బ్రాంచి కెనాల్‌కు రూ.319 కోట్లు
- కుప్పం బ్రాంచి కెనాల్ లైనింగ్ పనులకు రూ.197 కోట్లు

చిత్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి పథకానికి మహర్దశ పట్టనుంది. పుంగనూరు, కుప్పం బ్రాంచి కాలువల కాంక్రీట్ లైనింగ్ పనుల కోసం కూటమి ప్రభుత్వం రూ.516 కోట్లను విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అడవిపల్లె రిజర్వాయర్ వద్ద పూర్తయ్యే ప్రధాన కాలువలోనూ కాంక్రీట్ లైనింగ్ పనుల కోసం రూ.500 కోట్లతో ప్రతిపాదనలు పంపి ఉండగా.. మరో వారం పది రోజుల్లో ఆ నిధులు కూడా మంజూరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.రాయలసీమ జిల్లాల్లోని తాగు, సాగునీటి అవసరాల కోసం రూపుదిద్దుకున్న హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో కుప్పం బ్రాంచి కెనాల్ పనులు 2019లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయేటప్పటికి 90 శాతానికి పైగా పూర్తయ్యాయి.మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించని వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కుప్పంలో హంద్రీనీవా నీళ్లను వదులుతున్నట్లు స్టంట్ చేసి నవ్వులపాలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు హంద్రీనీవా మీద ప్రత్యేక దృష్టి సారించారు. సీఎంగా తొలిసారి కుప్పానికి వచ్చిన ఆయన, వెంటనే హంద్రీనీవా కాలువను పరిశీలించారు. పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపమని ఆ శాఖ అధికారులకు సూచించారు. 2019లో మిగిలిపోయిన 10 శాతం పనుల్ని దాదాపు పూర్తి చేయించేశారు. ఇక ఒక శాతం పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా.. తాజాగా పుంగనూరు, కుప్పం బ్రాంచి కెనాల్స్‌కు కాంక్రీట్ లైనింగ్ పనుల కోసం పెద్దఎత్తున నిధుల్ని మంజూరు చేశారు.

లైనింగ్ చేస్తేనే లక్ష్యం నెరవేరేది

కాంక్రీట్ లైనింగ్ పనులు చేస్తే వంద శాతం నీళ్లు చివరి వరకు చేరుతాయి. లేకుంటే కనీసం 50 శాతం నీళ్లను భూమి పీల్చుకుంటుంది. వేగం కూడా తగ్గుతుంది. 10 రోజుల్లో ఇవ్వాల్సిన నీళ్లను 20 రోజుల్లో ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టు కోసం డిజైన్ చేసిన పంపుల కెపాసిటీ కూడా లైనింగ్‌కు అనుగుణంగా సిద్ధం చేశారు.

వచ్చే సీజన్‌కు నీళ్లు

పుంగనూరు, కుప్పం బ్రాంచి కాలువల్లో లైనింగ్ పనుల్ని పూర్తి చేయడానికి 18 నెలల పాటు అగ్రిమెంట్ పీరియడ్ ఉన్నప్పటికీ.. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన పనుల్ని చేపట్టనున్నారు. మే 31లోగా పనులు పూర్తి చేసి, జూన్‌లోనే నీళ్లు ఇవ్వాలని సీఎం ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే అక్టోబరు కల్లా పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రెండు విడతల్లో కేబీసీ లైనింగ్ పనులు

కుప్పం బ్రాంచి కెనాల్ (కేబీసీ)లో కాంక్రీట్ లైనింగ్ పనుల కోసం రూ.197 కోట్లను కేటాయించారు. ఈ పనుల్ని రెండు విడతల్లో పూర్తి చేయనున్నారు.66.95వ కిలోమీటరు వరకు రూ.99.2 కోట్లను కేటాయించగా.. అక్కడినుంచి 131.2వ కిలోమీటరు వరకు (కుప్పం పట్టణం సమీపంలోని పరమసముద్రం చెరువు వరకు) రూ.97.71 కోట్లను కేటాయించారు. కుప్పం బ్రాంచి కెనాల్.. పుంగనూరు బ్రాంచి కెనాల్‌కు చెందిన 207.9వ కిలోమీటరు వద్ద ప్రారంభమై 131 కిలోమీటర్లు ప్రయాణిస్తుందన్న విషయం తెలిసిందే.



పుంగనూరు బ్రాంచి కెనాల్

అనంతపురంలోని పీబీసీకి రూ.319 కోట్ల నిధులు

పుంగనూరు బ్రాంచి కెనాల్ (పీబీసీ) ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రారంభమై.. ఆ జిల్లాలో 75 కిలోమీటర్లు, మన ఉమ్మడి జిల్లాలో 145 కిలోమీటర్లు.. మొత్తంగా 220 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ప్రస్తుతానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రయాణించే 0-75 కిలోమీటర్ల కెనాల్ లైనింగ్ పనుల కోసం రూ.319 కోట్లను మంజూరు చేశారు. దీన్ని కూడా రెండు ప్రాజెక్టులుగా పనులు చేయనున్నారు. 0-22 కిలోమీటర్ల వరకు రూ.112.40 కోట్లతో, 22-75 కిలోమీటర్ల వరకు రూ.207.20 కోట్లతో పనులు చేపట్టనున్నారు.

మన జిల్లాలోనూ పీబీసీ లైనింగ్ కోసం చర్చలు

చిత్తూరు జిల్లా పరిధిలోని పుంగనూరు బ్రాంచి కెనాల్ (75-220 కిలోమీటర్లు) కెపాసిటీని 380 క్యూసెక్కుల నుంచి 1180 వరకు పెంచేందుకు వైసీపీ హయాంలో రూ.1219.93 కోట్లతో టెండర్లు ఖరారయ్యాయి.ఇప్పుడు ఆ విస్తరణ పనుల్ని రద్దు చేసి కాంక్రీట్ లైనింగ్‌చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఈ క్రమంలోనే అప్పట్లో ఒప్పందం చేసుకున్న సంస్థతో లైనింగ్ పనులు చేయించేందుకు చర్చలు జరుగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో దీనికి సంబంధించిన ఉత్తర్వులు వచ్చే అవకాశాలున్నాయి.

ప్రధాన కాలువకు రూ.500 కోట్లతో ప్రతిపాదనలు

హంద్రీనీవా ప్రధాన కాలువ విషయానికొస్తే.. ఇది 554.175 కిలోమీటర్లు ప్రయాణించి కేవీపల్లె మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్ వద్ద ముగుస్తుంది. ప్రధాన కాలువలో 400 కిలోమీటర్ల వరకు లైనింగ్ పనులు జరుగుతున్నాయి. మిగిలిన 400-554.175 కిలోమీటర్లతో పాటు అడవిపల్లె నుంచి చిత్తూరుకు నీళ్లు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్న నీవా బ్రాంచి కెనాల్‌కూ లైనింగ్ పనులు చేసేందుకు రూ.500 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఈ నిధులు కూడా పది రోజుల్లో మంజూరయ్యే అవకాశముంది.



కార్తీక బ్రహ్మోత్సవాల వేడుకలు తిరుచానూరులో అంబరాన్నంటాయి. మంగళవారం ఉదయం అమ్మవారు కాళీయమర్ధనుడి అలంకారంలో సర్వభూపాల వాహనాన్ని అధిష్టించి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం 4.15 గంటలకు సర్వ తేజోమయమైన అమ్మవారు బంగారురథంపై శ్రీమహాలక్ష్మి రూపాన్ని ధరించి తిరుమాడవీధుల్లో విహరించారు. స్వర్ణరథాన్ని లాగేందుకు మహిళలు పోటీపడ్డారు. రాత్రి శ్రీవారికి ఇష్టమైన గరుడుడు అమ్మవారికి వాహనంగా మారారు. శ్రీమహావిష్ణువు రూపంలో గరుడవాహనంపై ఊరేగుతూ భక్తులను అమ్మవారు అనుగ్రహించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 12 కళా బృందాల ప్రదర్శనలు వాహనసేవల్లో భక్తులను అలరించాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



అలమేలుమంగ.. అభయమీయంగ!











శ్రీవారి పాదాల ఊరేగింపు

గరుడోత్సవంలో అమ్మవారికి శ్రీవారి పాదాలను అలంకరించడం ఆనవాయితీ. తిరుమల ఆలయం నుంచి స్వామివారి స్వర్ణపాదుకలను మంగళవారం ఉదయం 11 గంటలకు తిరుచానూరులోని పసుపు మండపానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాలు, భజన బృందాలలు నడుమ శ్రీవారి పాదాలను తిరువీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. రాత్రి శ్రీవారి పట్టపురాణి పద్మావతి అమ్మవారు స్వామివారి పాదాలు ధరించి గరుడసేవలో తరించారు. టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్, అర్చకులు శ్రీనివాసచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో

నేడు

ఉదయం 8 గంటలకు: సూర్యప్రభ వాహనం

మధ్యాహ్నం 12 గంటలకు: స్నపన తిరుమంజనం

రాత్రి 7 గంటలకు: చంద్రప్రభ వాహనం





గరుడ వాహనంపై పద్మావతి దేవి

ఉపాధ్యాయుడి బదిలీపై రోడ్డెక్కిన 'ఏకలవ్య' విద్యార్థులు

- పోలీసుస్టేషన్, తహసీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నా
- సొమ్మసిల్లిన ఇద్దరు బాలికలు
- విచారణ చేపట్టిన అధికారులు



పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కనమనంబేడులోని ఏకలవ్య గురుకుల పాఠశాల సైన్సు టీచరు సుమన్‌ను బదిలీ చేయడంపై విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించి పోలీసుస్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. సుమన్‌ను ఉద్దేశపూర్వకంగా ప్రిన్సిపాల్, వార్డెన్లు మార్పించారన్నారు. ఇంటర్ పరీక్షలకు రెండు నెలల ముందు సైన్సు ఉపాధ్యాయుడిని బదిలీ చేయిస్తే తమ చదువులు దెబ్బతింటాయన్నారు. బదిలీని రద్దు చేసే వరకు ధర్నా విరమించమని భీష్మించారు. ఉదయం టిఫిన్ చేయకుండా ధర్నాలో పాల్గొనడంతో ఇద్దరు విద్యార్థునులు స్పృహ కోల్పోయారు. ఎంఈవో రవీంద్రనాథ్ విద్యార్థులను సముదాయించారు. బదిలీపై విచారణ చేపడతామని చెప్పడంతో ధర్నా విరమించారు. కాగా, ఉపాధ్యాయుడి బదిలీ విషయంపై ఐటీడీఏ పీవో పరిమళ, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి సూర్యనారాయణ, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీవో త్రివిక్రమరావు, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం విచారణ చేపట్టారు. సుమన్ ప్రవర్తనపై, వైఖరిపై విద్యార్థులను విచారించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి బదిలీ నిలుపుదలకు ప్రయత్నిస్తామన్నారు.



ఏకలవ్య గురుకులంలో విచారిస్తున్న అధికారులు

అందరినీ ఒక్కసారిగా వదలడంతో..!

- ఏటీజీహెచ్ వద్ద భక్తుల మధ్య తోపులాట
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన విజిలెన్స్



ఏటీజీహెచ్ వద్ద భక్తుల మధ్య తోపులాట





దగ్గరుండి క్యూలైన్‌లోకి భక్తులను పంపుతున్న చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఏటీజీహెచ్‌లో టైంస్లాట్ భక్తుల మధ్య మంగళవారం తోపులాట జరిగింది. విజిలెన్స్ అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని తెలుస్తోంది. మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఆగచాట్లు పడ్డారు. స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు (ఎస్ఎస్‌డీ) పొందిన భక్తులను తిరుమలలోని ఎస్వీ గెస్ట్‌హౌస్ వద్దనున్న ఏటీజీహెచ్ కాటేజీ వద్దనున్న క్యూలైన్లలోకి అనుమతిస్తారు. మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ ఉండటంతో చాలా మంది భక్తులు ఎంబీసీ రోడ్డు వద్ద గుంపుగా చేరిపోయారు. వీరిని స్లాట్ల వారీగా క్యూలైన్‌లోకి అనుమతించాలి. వివిధ స్లాట్లలో ఉన్న భక్తులను వేరుచేయలేక విజిలెన్స్ అధికారులు, సిబ్బంది అందరినీ వదిలారు. భక్తులందరూ ఒక్కసారిగా ముందుకు దూసుకొచ్చారు. చిన్నపాటి వెడల్పుతో ఉన్న ప్రవేశమార్గాల్లో ముందుకు వెళ్లే క్రమంలో భక్తుల మధ్య తోపులాట జరిగింది. ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు ఇలా ఒకరినొకరు నెట్టుకోవడంతో చిన్నారులు, మహిళలు పెద్దగా కేకలు వేశారు. పైగా ప్రవేశమార్గాల్లో, క్యూలైన్ల నిర్వహణ బాధ్యతలను శ్రీవారి సేవకులకు అప్పగించడంతో తోపులాటను అదుపుచేయడం వీరికి సాధ్యం కాలేదు. ఇంతమంది అధికారులు, సిబ్బంది ఉండి కూడా ఇలాంటి నిర్లక్ష్యం ఏంటంటూ భక్తులు ఆగ్రహించారు. ఆ సమయంలో సర్వదర్శనం క్యూలైన్‌లో వెళ్లి శ్రీవారిని దర్శించుకోవాలనే ఉద్దేశ్యంతో టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఏటీజీహెచ్ వద్దకు చేరుకున్నారు. భక్తుల మధ్య తోపులాటను చూసిన ఆయన అధికారులతో పాటు ఛైర్మన్ బీఆర్ నాయుడికి సమాచారమిచ్చారు. దీంతో ఛైర్మన్ వెంటనే అక్కడికి చేరుకుని వైకుంఠం క్యూకాంప్లెక్స్ ఏవీఎస్వో, వీఐ ఇతర అధికారులను పిలిపించి తోపులాటలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దగ్గరుండి నెమ్మదిగా భక్తులను ముందుకు పంపడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

ఎస్వీయూలో ఉద్రిక్తత

- అన్యమత ప్రచారం.. ప్రొఫెసర్‌పై దాడి ఘటనతో ఉన్నతాధికారుల సీరియస్
- తక్షణ విచారణకు నలుగురితో కమిటీ
- పోలీసు విచారణ చేపట్టాలని నిర్ణయం
- దళిత సంఘాలు, ఏబీవీపీ పోటాపోటీ ఆందోళనలు



పరిపాలనా భవనం వద్ద బైఠాయించిన దళిత సంఘాల నేతలు



వీసీ, రిజిస్ట్రార్లకు విన్నవిస్తున్న ఏబీవీపీ నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం తలెత్తిన అన్యమత ప్రచార వివాదం నేపథ్యంలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. ఇటు అన్యమత ప్రచారం.. అటు ప్రొఫెసర్‌పై దాడి వ్యవహారాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. మంగళవారం ఉదయాన్నే ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సమావేశమయ్యారు. ఈ ఘటనలపై విచారణకు నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధారాణి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసయ్య, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లను నియమించారు. మరోవైపు వర్సిటీలో అన్యమత ప్రచారానికి పాల్పడిన ప్రొఫెసర్ చెంగయ్యపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పూజారి రాఘవేంద్ర, నాయకులు సురేంద్ర, పవన్, ఈశ్వర్, నందకిషోర్ తదితరులు ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. వర్సిటీలో మత విద్వేషాలకు చోటివ్వకూడదని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, టీఎన్ఎస్ఎఫ్, జీఎస్ఎస్, బీసీ యూనియన్‌ల నాయకులు అక్బర్, చిన్న, రవి, ఆర్కే నాయుడు, రామ్మోహన్, అశోక్, మల్లికార్జున, శివశంకర్‌నాయక్, మహేంద్రనాయక్ తదితరులు ఇన్‌చార్జి వీసీ అప్పారావుకు ఉమ్మడిగా వినతిపత్రం అందజేశారు. బయటి వ్యక్తులు ప్రొఫెసర్‌పై దాడి చేయడం వర్సిటీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. మత సంబంధమైన ఎలాంటి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వకూడదని కోరారు. ఇక, దళిత ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి అమానుషమంటూ పలు దళిత విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పరిపాలనా భవనం ముందు నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రేమ్‌కుమార్, అమృతతేజ, సుధాకర్, యుగంధర్, సుబ్రమణ్యం, సుందర్, సదాశివ డిమాండు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మొహరించాయి. ఎలాంటి ఘటనలకు తావివ్వకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు.

శ్రీవారి సేవలో సుచిత్ర ఎల్లా దంపతులు



తిరుమల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): భారత్ బయోటెక్ ఛైర్మన్ కృష్ణ ఎల్లా, ఆయన సతీమణి, బోర్డు సభ్యురాలు సుచిత్ర మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న వారికి వేదపండితులు ఆశీర్వచనం చేశారు.

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ దస్తావేజులు

- రేణిగుంటలో అన్ని రిజిస్ట్రేషన్ల పరిశీలిస్తున్నామన్న అదనపు ఐజీ

రేణిగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్‌కు అవసరమైన దస్తావేజు తయారు చేసే విధానం ఆన్‌లైన్‌లో ఉందని, దాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రేషన్ శాఖ అదనపు ఐజీ ఉదయ్‌భాస్కర్ చెప్పారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండో రోజైన మంగళవారం కూడా రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ జరిగి పెండింగ్‌లో ఉన్న, రిలీజ్‌కాని పత్రాలను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని త్వరలో పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయనున్నట్లు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే అవినీతిపై ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.



ఏఐజీ ఉదయభాస్కర్

రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయండి

- కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్టు పనులకు తిరుపతి, రేణిగుంట రైల్వే బైపాస్‌రోడ్డు తదితరాలకు సంబంధించిన భూ సంబంధిత పెండింగ్ అంశాలపై, నిర్మాణ పురోగతిపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో కలెకర్ సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, పీడీ వెంకటేష్, ఎంకే చౌదరి, రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో 'ఉద్యాన' సాంకేతిక విప్లవం!

● సీవోఈలో జాతీయ సదస్సు ప్రారంభం

కుప్పం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):కుప్పం నియోజకవర్గంలో ఉద్యాన సాంకేతిక విప్లవం ఊపందుకుంటోంది.దేశం నలుమూలల్లో గల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల నుంచి శాస్త్రవేత్తలను, ఆయా ప్రభుత్వాధికారులను కుప్పం రప్పించి శిక్షణ ఇచ్చే కార్యక్రమం ప్రారంభమైంది. కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (పూలు, కూరగాయలు)లో మంగళవారం ఉద్యాన పంటల్లో శాస్త్రీయ, సాంకేతిక పద్ధతులపై మూడు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఇజ్రాయిల్ ప్రభుత్వం కలిసి నిర్వహిస్తున్న ఈ సదస్సును ఇండో ఇజ్రాయిల్ ఎంబసీ, న్యూ ఢిల్లీ అగ్రికల్చర్ అటాచీ ఉరీ రూబిన్ స్టీన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ బ్రహ్మదేవ్, జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదనరెడ్డిలతో కలిసి ఎమ్మెల్సీ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం సీవోఈలో ఉద్యాన పంటలైన పువ్వులు, కూరగాయలపై ప్రత్యేకంగా పరిశోధనలు జరుగుతున్నాయని, శాస్త్రీయ సాంకేతిక పద్ధతుల ద్వారా గ్రాఫిటింగ్ ద్వారా నాణ్యమైన నూతన వంగడాలను సృష్టించి రైతులకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రైతులకు మేలుతోపాటు ఈ సీఈవో వల్ల ముఖ్యమంత్రి ఎల్లప్పుడూ చెప్పే ఆదాయ వనరుల వృద్ధి కూడా జరుగుతున్నదన్నారు. ఇప్పటికే గ్రాఫిటింగ్ పద్ధతిలో సృష్టించిన నూతన వంగడాల మొక్కల ద్వారా రూ.3.5 లక్షల మేర టర్నోవర్ ఉండగా, అందులో రూ.1.5 కోట్లు లాభాలు వచ్చాయని లెక్కలు చెప్పారు. మొత్తం 22 రకాల వంగడాలపై ఇక్కడ పరిశోధనలు సాగుతున్నాయన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెప్పి, ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను సీవోఈతో అనుసంధిస్తామని, అలాగే ద్రావిడ విశ్వవిద్యాలయంలో నూతన ఉద్యాన కోర్సులు ప్రవేశపెడతామని తెలిపారు.స్థానికంగా రైతులు పండించిన పంటలను ఎగుమతి చేసేందుకు కార్గోతోపాటు డొమెస్టిక్ విమానాశ్రయాల నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతేకాక నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు 2 వేల ఎకరాల భూమిని సేకరించామని, అందులో ఏకంగా 500 ఎకరాలను కేవలం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకోసమే కేటాయించామన్నారు. టమోటా, మ్యాంగో వంటి ఉత్పత్తుల నుంచి పల్ప్, కెచప్ తయారు చేసే పరిశ్రమలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో శాస్త్ర సాంకేతిక పద్ధతుల్లో సాగు విధానాలపై రైతులకు శాస్త్రవేత్తలు శిక్షణ ఇస్తారని చెప్పారు.అనంతరం ఆయన ఉద్యాన రైతులకు పవర్ టిల్లర్లు, పవర్ వీడర్లు, తైవాన్ పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. మల్చింగ్, డ్రిప్, సాగు పద్ధతులు, పాలీ హౌస్‌లు, నర్సరీలలో మొక్కలు అంటుకట్టే విధానం తదితర అంశాలపై ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నిష్ణాతులైన శిక్షకులు శిక్షణ ఇచ్చారు. మూడురోజులపాటు జరిగే ఈ సదస్సులో దేశంలోని 12 రాష్ట్రాలనుంచి మొత్తం 40 మంది ప్రభుత్వ అధికారులు, ఇతర ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ అధికారి బాలసుబ్రహ్మణ్యం, హార్టికల్చర్ ఏడీ కోటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.



అంటుకట్టే సాంకేతిక పద్ధతుల గురించి ఆసక్తిగా తెలుసుకుంటున్న విదేశీ ప్రతినిధులు





జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు - సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.49 కోట్లు



ఈవో పర్యవేక్షణలో కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణి పాకం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,49,62,798 లభించింది. మంగళవారం ఆస్థాన మండపంలో కానుకలను ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. ఐదు గ్రాముల బంగారు, రెండు కిలోల 785 గ్రాముల వెండి, 491 యూఎస్‌ఏ, 20 కెనడా, 15 ఆస్ట్రేలియా డాలర్లు, 10 యూఏఈ దిర్హమ్స్, 178 మలేసియా రింగిట్స్ సమకూరాయి. గోసంరక్షణ హుండీ ద్వారా రూ.11,708 లభించింది. నిత్యాన్నదానం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.31,751 వచ్చాయి. ఈ ఆదాయం 19 రోజుల్లో లభించందని ఈవో తెలిపారు. ఏఈవోలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు, సీఎఫ్‌వో నాగేశ్వరచౌదరి, కాణిపాకం యూనియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర పురోభివృద్ధికి కేంద్రం సహకరించాలి

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



చిత్తూరు సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురోభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. మంగళవారం లోక్‌సభలో ఆయన ప్రసంగించారు. ముద్ర లోన్ల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి ముద్ర రుణాలు, పీఎంఈజీపీ పథకం అమలుకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బ్యాంకింగ్ రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు భేష్ అని కొనియాడారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించేందుకు అర్హులైన వారందరికీ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కుప్పంలో 6నుంచి ఆధార్ అప్డేషన్ శిబిరాలు

కుప్పం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని కుప్పం మున్సిపాలిటీతోపాటు నాలుగు మండాలల్లో విద్యార్థులకోసం ప్రత్యేకంగా ఆధార్ అప్డేషన్ క్యాంపులు నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజవకర్గమైన కుప్పంలో అపార్ కార్డులకోసం ఆధా ర్ కార్డుల్లోని తప్పులను సవరించుకోవాల్సిన ప రిస్థితి విద్యార్థులకు ఏర్పడింది. మీ సేవా కేంద్రా ల్లో కానీ, సచివాలయాల్లో కానీ తగినన్ని అప్డేషన్ కేంద్రాలు లేకపోవడంతో నెల రోజులుగా విద్యార్థులు,వారితల్లిదండ్రులు ఇబ్బందులు పడు తున్నారు.ఈసమస్యను కడా పీడీ వికాస్ మర్మత్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కుప్పం నియోజకవర్గంలోని కుప్పం మున్సిపాలిటీతోపాటు నాలుగు మండలాల్లో మండలానికి రెండు రోజుల వంతున ఆధార్ అప్డేషన్ శిబిరాలు నిర్వహించడానికి కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి ఆర్డీవో శ్రీనివాసరాజును నోడల్ అధికారిగా నియమించారు. గుడుపల్లె మండలంలో ఈనెల 6, 7 తేదీలలో, కుప్పం మండలంలో 9, 8 తేదీలలో, కుప్పం మున్సిపాలిటీలో 11, 12 తేదీలలో, రామకుప్పం మండలంలో 16, 17 తేదీలలో, శాంతిపురం మండలంలో 18, 19 తేదీలలో ఆధార్ అప్డేషన్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. విద్యార్థులు ఈ అప్డేషన్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఆధార్ కార్డులను అప్డేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే అధికారులు ఇంకా అప్డేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయబోయే స్థలాలను ఎంపిక చేయలేదు. దీనిపై ఆర్డీవో శ్రీనివాసరాజును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా బుధవారం ఆయా అప్డేషన్ శిబిరాలకు అనువైన స్థలాలను ప్రకటిస్తామని చెప్పారు.





మహదేవపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు - పోలీస్ స్టేషన్ వద్ద ఆగిన ఆర్టీసీ బస్సు

దంచికొట్టిన వర్షం

రాకపోకలకు అంతరాయం

పాలసముద్రం, డిసెంబరు 3 ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో సోమవారం రాత్రి పాలసముద్రం మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. చెరువులు నిండి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో మంగళవారం మధ్యాహ్నం వరకు చిత్తూరు-బలిజకండ్రిగ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మహదేవపురం, రాచపాళ్యం కోన కాలువ, మరవలం కాలువలు ఉధృతంగా ప్రవహించడంతో చిత్తూరు-షోళింగర్ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కాలువ గట్లపై ఉన్న కొబ్బరి చెట్లు నేలకూలి, బ్రిడ్జిల వద్ద ఇరుక్కుపోవడంతో వాటిని ఎక్స్‌కవేటర్ల సాయంతో అధికారులు తొలగించారు. వాగుల ఉధృతి మధ్యాహ్నంపైన తగ్గడంతో రాకపోకలు సాగాయి.

ఎంపీ ల్యాడ్స్ సకాలంలో ఖర్చు చేయండి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ల్యాడ్స్ కింద జిల్లాకు అందిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.4.81 కోట్ల అంచనా వ్యయంతో 88 పనులు మంజూరు చేశామన్నారు. వాటిలో రూ.73లక్షలతో 25 పనులు పూర్తవగా, 13 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మంజూరైన పనుల్లో రూ.5లక్షల అంచనా కలిగిన పనులను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. చిత్తూరు, మదనపల్లె డివిజన్లలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.1.75 కోట్లతో 15 పనులు మంజూరు చేశామన్నారు. ఉపాధి పథకం కింద చేపట్టిన పనులన్నీ త్వరగా పూర్తి చేయాలన్నారు. పీఆర్ డీడీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నరేంద్ర, సీపీవో సాంబశివారెడ్డి, కమిషనర్లు పాల్గొన్నారు.

మైక్రో ఇరిగేషన్ లక్ష్యాలను పూర్తి చేయండి

ఉద్యాన పంటల సాగుకు అనుకూలమైన మండలాల్లోని రైతులను బిందు, తుంపర్ల సేద్యం వైపు ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మైక్రో ఇరిగేషన్ లక్ష్యాల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. పెద్దపంజాణి, పులిచెర్ల, పూతలపట్టు, గుడుపల్లె, గంగవరం, సోమల, చౌడేపల్లె మండలాల్లో కూరగాయలు, మామిడి తోటల్లో బిందు, తుంపర్ల సేద్యానికి అవకాశం ఉందన్నారు. వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, మైక్రో ఇరిగేషన్ అధికారి బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మంచి పేరుతెచ్చుకున్న కూటమి ప్రభుత్వం

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మంచి పనులు చేసి.. మంచి పేరు తెచ్చుకుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 150 రోజులైందన్నారు. ప్రజలు ప్రభుత్వానికి సహకరిస్తూ ముందుకు నడిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం రూ.4వేల పింఛనును అవ్వాతాతలకు ప్రతినెలా ఒకటో తేదీన ఇళ్ల వద్దే అందిస్తోందని చెప్పారు. 175 అన్న క్యాంటీన్లు ప్రారంభించి.. పేదల ఆకలి తీర్చుతోందని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించిదని అన్నారు. దీపం-2 కింద కోటికి పైగా ఉచిత గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసిందని వివరించారు. పంచాయితీలకు రూ.1,452 కోట్లు, మున్సిపాలిటీలకు రూ.300 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులు పునఃప్రారంభించడం.. ఇవేకాక అనేక రకాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. మోహన్‌రాజ్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రవీణ్‌కుమార్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో జరిగిన ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల్లో జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. పీలేరు నియోజకవర్గం రెడ్డివారిపల్లెకు చెందిన ఈయన 2020 నుంచి విద్యార్థుల సమస్యలపై పోరాటం చేశానని పేర్కొన్నారు.

పాఠశాల చుట్టూ వర్షపు నీరు



ఐరాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలోని చిగరపల్లె ప్రాథమిక పాఠశాలలోకి మంగళవారం వర్షపు నీరు చేరి విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వాన నీటితోపాటు పాములు వస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వీఆర్‌కు ఏఎస్ఐ దామోదర్

పుంగనూరు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పుంగనూరు ఏఎస్ఐ దామోదర్‌ను చిత్తూరు హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని కొత్తపేట క్రాస్‌లోని చికెన్‌సెంటర్ వ్యాపారి మహబూబ్‌బాషాపై చేయి చేసుకోవడం, దురుసుగా ప్రవర్తించినట్లు వార్తలు రావడంతో జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు.

డీసీసీబీలో ఆర్థిక అవకతవకలపై విచారణాధికారిగా డీఆర్వో నియామకం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో గత పాలకవర్గం చేసిన ఆర్థిక విధ్వంసంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ సహకార చట్టం సెక్షన్ 51 ప్రకారం విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్‌ను నియమించారు. ఈయన 120 రోజుల్లోగా విచారించి, నివేదిక ఇవ్వనున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చైర్‌పర్సన్ ఎం.రెడ్డెమ్మ అధ్యక్షతన ఏర్పడిన పాలకవర్గంలో జరిగిన అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో జూలై 11, 12, నవంబరు 13వ తేదీన వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతోపాటు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు గత పాలకవర్గం తప్పిదాలపై సీఎం చంద్రబాబుకు అక్టోబరులో ఫిర్యాదు చేశారు. దాంతో అక్టోబరు 10న ప్రభుత్వం విచారణకు డీసీవో నాగవర్ధనను ఆదేశించింది. ఆమె ప్రాథమిక విచారణ జరిపి బ్యాంకు పరిధిలో అక్రమాలు, అవకతవకలు జరిగింది వాస్తవమే అంటూ నివేదిక పంపారు. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ జరపాలని కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. దాంతో డీఆర్వోను ఆయన విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఎగరడానికి రెడీ

రాకెట్ ఎత్తు: 44.4 మీటర్లు
బరువు: 320 టన్నులు
ప్రయోగానికి పట్టే సమయం: 26.92 నిమిషాలు



ప్రయోగ వేదికవద్దకు రాకెట్ భాగాలు

స్వదేశీ, విదేశీ శాస్త్రవేత్తలతో శ్రీహరికోట రాకెట్ కేంద్రం సందడిగా మారింది. సాయంత్రం 4.08 గంటలకు పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి చేర్చనున్న సంగతి తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం 2.38 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ రేపు సాయంత్రం దాకా కొనసాగుతుంది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక మీద రాకెట్ ఎగరడానికి సిద్ధంగా ఉంది. కాగా, పీఎస్ఎల్వీ అనుసంధాన ప్రక్రియకు సంబంధించిన ఫొటోలను ఇస్రో మంగళవారం విడుదల చేసింది. పీఎస్ఎల్వీ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ పెసిలిటీ (పీఐఎఫ్)లో రెండు దశల రాకెట్‌ను, మొబైల్ సర్వీస్ టవర్‌లో (ఎంఎస్‌టీ) మరో రెండు దశల రాకెట్‌ను అనుసంధానం చేశారు.



మొదటి దశ: 139 టన్నులు ఘన ఇంధనం కలిగిన రాకెట్ మొదటి దశను కేరళలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో డిజైన్ చేసి తీసుకొచ్చి శ్రీహరికోటలో అనుసంధానం చేశారు.



ప్రోబా-3 ఉపగ్రహం



రెండో దశ: పీఎస్-2 మోటారులో 41 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపారు. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో మోటారు తయారు చేశారు.





మూడో దశ: 7.65 టన్నుల ఘన ఇంధనం నింపారు.



నాలుగోదశ: ఈ దశలో 2.5 టన్నుల ద్రవ ఇంధనం నింపారు. రాకెట్ శిఖర భాగాన ప్రోబా-3 ఉపగ్రహాన్ని అమర్చారు. ఉపగ్రహం చుట్టూ హీట్‌షీల్డ్ (ఉష్ణకవచం) అమర్చారు. ఇది తుది దశ. ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టే రాకెట్ దశ ఇది. ఈ దశలో ఘన ఇంధనం మోటార్లకు నింపి రాకెట్‌కు అనుసంధానం చేశారు. కౌంట్‌డౌన్ జరిగే సమయంలోనే ద్రవ ఇంధనాన్ని నింపుతారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

వి.కోట అభివృద్ధికి సహకరించండి


చంద్రబాబును కలసిన రంగనాథ్

వి.కోట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వి.కోట అభివృద్ధికి సహకరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్ సీఎం చంద్ర బాబును కోరారు. మంగళవారం అమరా వతిలో ఆయన్ను కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం రంగనాథ్ మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం పూర్తిచేయించాలని కోరగా త్వరలోనే పూర్తిచేయిస్తామని సీఎం హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వచ్చే ఏడాది డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభిస్తామని, బైపాస్ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారని వివరించారు. అలాగే వైసీపీ హయాంలో టీడీపీ నాయ కులపై, కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసులు ఎత్తేయాలని హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లామన్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన తప్పుడు కేసుల అంశాన్ని ప్రత్యేకంగా క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటా మని ఆమె హామీ ఇచ్చారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జులు హరినాథరెడ్డి, మండల రైతు అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షులు లక్ష్మణ్‌చౌదరి, నాయకులు విశ్వేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

అంధకారంలోనే పలు గ్రామాలు


ఎల్లంకివారిపల్లి వద్ద మరమ్మతులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

కల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో పులిచెర్ల మండలంలో కురుస్తున్న వర్షాలు, వీచిన ఈదురు గాలులతో సోమవారం రాత్రి పది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో రాత్రంతా అంధకారంలోనే అనేక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని ఎల్లంకివారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎదురుగా కొబ్బరిచెట్టు విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ స్తంభం విరిగిపోగా వైర్లు ఎక్కడికక్కడ తెగిపోయాయి. దేవళంపేట పంచాయతీలో (1), కమ్మపల్లి పంచాయతీ (2), వెంకటదాసరపల్లి పంచాయతీ (2), ఎర్రపాపిరెడ్డిగారిపల్లి పంచాయతీ (3), పులిచెర్ల పంచాయతీలో ఒక స్తంభం చొప్పున విరిగిపోయాయి. దీంతో సంబంధిత గ్రామాల్లో రాత్రి నుంచి మంగళవారం పగలంతా విద్యుత్ సరఫరా ఆగిపోయింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు విద్యుత్ సిబ్బంది చర్యలు చేపట్టినట్లు ఏఈ పురుషోత్తం తెలిపారు.

బైరెడ్డిపల్లెలో జేసీ పర్యటన


రెవిన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

బైరెడ్డిపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులను క్షేత్రస్థాయిలో మంగళవారం జాయింట్ కలెక్టర్ విద్యాధరి పరిశీలించారు. రోడ్డు కోసం భూములు కోల్పోతున్న రైతులు, స్థానికులతో జేసీ మాట్లాడారు. నష్టపరిహారం పెంచాలని భూ బాధితులు జేసీకి విన్నవించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్డీవో భవాని, బైరెడ్డిపల్లె తహసీల్దార్ మాధవరాజు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి: సీపీఎం


సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా

పలమనేరు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): సిల్కుఫారం వద్ద కనీస వసతులు కల్పించాలని సీపీఎం నాయకుడు గిరిధర్ గుప్తా డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు సిల్కుఫారం వాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిల్కుఫారం వద్ద తాగునీరు, వీధి దీపాలు లేకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చీకట్లో పాములు, విషపురుగులు ఇళ్లలోనికి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

మనవడికి అవ్వను అప్పగించిన 'అమ్మఒడి'



పలమనేరు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అమ్మఒడి నిర్వాహకులు పద్మనాభ నాయుడు మనవడికి అవ్వను అప్పగించారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిని సుమారు 10 రోజుల క్రితం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి వచ్చాడు. ఆ తల్లి ఆరోగ్యం కుదుటపడినా కుమారుడు రాకపోవడంతో డాక్టర్లు మాధవరెడ్డి, వంశీకృష్ణ అమ్మఒడి నిర్వాహకులు పద్మనాభ నాయుడుకు తెలియజేశారు. ఆయన తన వాహనంలో మంగళవారం ఆ వృద్ధురాలిని పలమనేరుకు తీసుకొచ్చారు. అమ్మఒడి సభ్యులైన ప్రమీల, మధుమోహనరావుల సహకారంతో వృద్ధురాలి మనవడి ఇంటికి చేర్చారు.

వైకల్యం శరీరానికి మాత్రమే.. మనసుకు కాదు


దివ్యాంగులకు పరికరాలను అందిస్తున్న దాతలు, అధికారులు

గంగవరం, డిసెంబరు3,(ఆంధ్రజ్యోతి): వైకల్యం అనేది శరీరానికి మాత్రమే నని.. మనస్సుకు, మేథస్సుకు కాదని ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గంగవరం హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దాతల సహకారంతో భవిత కేంద్రానికి అవసరమైన సామగ్రి, విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 శ్రీనివాసులు, హెచ్‌ఎం రూపాదేవి, సురేఖ, త్రిలోక్, అశోక్‌కుమార్, దాత వెంకటస్వామి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

స్వెట్టర్ల పంపిణీ



పలమనేరు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు భవిత పాఠశాలలో మంగళవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన తిరుమల జ్యువలరీస్ యజమాని చెంచు రెడ్డి దివ్యాంగులందరికీ ఎంఈవో బాల సుందరం చేతుల మీదుగా స్వెట్టర్లను అందజేశారు. అలాగే ఆపద్బంధు చిల్డ్రన్స్ ట్రస్టు వారు పిల్లలకు స్టేషనరీ వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షంషేర్, ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సహిత అధ్యాపకురాలు మంగేశ్వరి, అధ్యాపకుడు మురళి పాల్గొన్నారు.

రామకుప్పం: సమాజంలో విభిన్న ప్రతిభా వంతుల పట్ల వివక్షత చూపరాదని రామకుప్పం ఎంఈఓ నారాయణప్ప కోరారు. మంగళవారం రాస్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో విభిన్న ప్రతిభావంతురాలైన చిన్నారితో ఆయన కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుజాత, కుమార్‌నాయక్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న తోటలు


బగళనత్తంలో నేలవాలిన బీన్స్ తోట

రామకుప్పం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను రామకుప్పం మండలంలోని రైతులకు ఆవేదనను మిల్చింది. భారీ వర్షాలు కురిసి, చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు జలాలతో నిండి భూగర్భజలాలు వృద్ధి చెందుతాయన్న అన్నదాతల ఆశలపై ఎడతెరపిలేని ముసురు నీళ్లు చల్లింది. పలు ప్రాంతాల్లో ఉద్యాన పంటలకు పెద్ద ఎత్తున నష్టం కలిగింది. టమోటా, బీన్స్, స్వీట్‌కార్న్ తోటలు, వరిపైరులు నేలవాలి పోయాయి. బంగాళదుంప పంట దెబ్బతినింది. నెల రోజుల కిందట భూమిలో వేసిన విత్తన బంగాళదుంపలు ముసురుతో పైకి తేలి, పనికి రాకుండా పోయాయి. ప్రభుత్వం స్పందించి క్షేత్రస్థాయిలో పంటనష్టాన్ని అంచనా వేసి తమకు నష్టపరిహారం అందించాలని బాధితరైతులు కోరుతున్నారు.

7న గుడుపల్లె మండల సమావేశం

గుడుపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 7వ తేదీ శనివారం ఉదయం స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాధాక్రిష్ణ తెలిపారు. సభ్యులు, సర్పంచులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు అబకలదొడ్డిలో ప్రజా దర్బారు

శాంతిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలంలోని అబకలదొడ్డి గ్రామ పంచాయతీ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఉదయం 10 గంటలకు 'మన పంచాయతీ వద్దకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుమార్ తెలిపారు. కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం హాజరవుతారని తెలిపారు.

హుండీ చోరీ

చౌడేపల్లె, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రామాలయంలో హుండీ చోరీ జరిగింది. ఈ ఘటన చౌడేపల్లె మండలంలో జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు.. బి.కదిరేపల్లె గ్రామంలో రామాలయం ఉంది. మంగళవారం ఉదయం గ్రామస్తులు ఆలయ తాళాలు బద్దలు కొట్టి ఉండటం గమనించారు. లోన చూడగా హుండీ కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కళాశాలకు కంప్యూటర్ల విరాళం



చౌడేపల్లె, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం 4 కంప్యూటర్లను ఓ దాత విరాళంగా ఇచ్చినట్లు ప్రిన్స్‌పాల్ జయప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వికోటకు చెందిన దాత దశరథరెడ్డి విద్యార్థులలో స్కిల్స్ పెంపొందించేందుకు రూ.1.20లక్షల విలువ చేసే 4 కంప్యూటర్లను విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బాలాజి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లి డంపింగ్ యార్డు వద్ద మంగళవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ.6700 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గంగమ్మ చెరువుకు గండి

సోమల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు పలు చెరువులకు జలకళ సంతరించుకుంది. నెల్లిమంద పాలేటమ్మ ఆలయం సమీపంలోని గంగమ్మ చెరువుకూడా నిండి మొరవపోతోంది. అయితే ఈ చెరువుకు రెండు చోట్ల గండిపడింది. రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. లీకేజీ నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాపు సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

పలమనేరు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): జాతీయ కాపు సంఘం పలమనేరు నియోజకవర్గ అధ్యక్షుడిగా పుష్పాల వెంకటేశ్వర్లు నియమితుల య్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మురళీక్రిష్ణ నాయుడు నియామకపు ఉత్తర్వులు పంపారు. వెంకటేశ్వర్లుకు పలువురు కాపు నాయ కులు అభినందనలు తెలియజేశారు.

6న చింత చెట్ల వేలం

పుంగనూరు రూరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దమఠం పరిధిలోని చింత చెట్లను ఈ నెల 6వ తేదీ బహిరంగ వేలం వేయనున్నట్లు పెద్దమఠం ఫిట్ పర్సన్ కమలాకర్ తెలిపారు.

కారు బోల్తా ముగ్గురికి గాయాలు

వి.కోట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వి.కోట - పేర్నాంబట్ జాతీయ రహదారిలో బంగ్లాఊరు వద్ద కారు అదుపు తప్పింది. ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. మంగళవారం ఉదయం తమిళనాడుకు చెందిన వారు ఆస్ట్రేలియా నుంచి బెంగళూరు విమానాశ్రయానికి వచ్చారు. అక్కడి నుంచి కారులో వెళుతుండగా బంగ్లా ఊరు వద్ద రోడ్డుపై గుంతలో దిగి అదుతప్పి బోల్తాపడింది. డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.

పంటలకు బీమా చేసుకోండి

పుంగనూరు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించే పంటలు వరి, వేరుశనగ, టమోటా పంటలకు బీమా చేసుకోవాలని ఏడీఏ శివకుమార్‌రాజు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు పండిస్తున్న వరి ఎకరానికి రూ.84లు ఈనెల 31తేదీలోపు, వేరుశనగకు ఎకరానికి రూ.60, టమోటా పంటకు రూ.500 ఈనెల 15తేదీ లోపు చెల్లించాలని తెలియజేశారు.

ఆనందం..ఆవేదన

- చెరువుల మొరవలు.. మునిగిన పంటలు
- ఫెంగల్ తుపాను మిగిల్చిన పరిస్థితులు



ఉధృతంగా ప్రవహిస్తున్న గార్గేయ నది, నేలకొరిగిన వరి పంట

సదుం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను సదుం మండలంలో కొందరికి ఆనందం పంచగా మరికొందరికి ఆవేదన మిగిల్చింది. ఎడతెరిపి లేని వర్షాలతో తిమ్మానాయనిపల్లె పంచాయతీలోని వ్యాసప్ప చెరువు, బుడ్డారెడ్డి చెరువు, చిక్కారాయ చెరువు, కొర్లగుంటవారిపల్లె ప్రాజెక్టు, సింహం గుండ్ల ప్రాజెక్టులకు వర్షపు నీరు సమృద్ధిగా చేరి మొరవలు సాగుతున్నాయి. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో అమ్మగారిపల్లె, గొంగివారిపల్లె, తిమ్మానాయనపల్లె, కంభంవారిపల్లె, పాలమంద, బూరగమంద, చెరుకువారిపల్లె పంచాయతీల్లో చాలాచోట్ల సుమారు 25 హెక్టార్లలో కోతకు వచ్చిన వరి పంట నేలకొరిగింది. వీరంతా నష్టపోయారు. అలగే నడిగడ్డ గ్రామం కురవపల్లెలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సంబంధిత అధికారులు మొరవలు పోతున్న చెరువులను, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్టపరి హారం నివేదికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు.

పొంగి ప్రవహిస్తున్న గార్గేయ నది

సోమల: మండలంలోని పలు చెరువులు మొరవలు పోతూ గార్గేయ నదిలో కలుస్తున్నాయి. దీంతో గార్గేయ నది ప్రవహిస్తోంది. పెద్దఉప్పరపల్లె సమీప దుర్గం కొండలో పుట్టి పలు పంచాయతీల గుండా ప్రవహిస్తున్న గార్గేయ నది జోరుగా ప్రవహించడంతో ఆ నదీ పరివాహకంలోని ఆవులపల్లె, వత్రపల్లె, నంజంపేట, మల్లేశ్వర పురం, పొదలకుంట్లపల్లె, కమ్మపల్లె, చిన్న ఉప్పరపల్లె సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు సోమల విద్యార్థులు


అయ్యప్ప చరణ్ తేజ, అనన్య

సోమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో శివరత్న తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నవంబరు 30న పూతలపట్టులో జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో అంతర్ జిల్లాల త్రోబాలో పోటీలు జరిగాయన్నారు. ఇందులో సోమల హైస్కూల్ విద్యార్థి పి.అయ్యప్ప చరణ్‌తేజ, సూరయ్యగారిపల్లె హైస్కూల్ విద్యార్థి అనన్య విశేష ప్రతిభ కనబరిచారని గుర్తుచేశారు. దీంతో వీరు డిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. సోమల, సూరయ్యగారిపల్లె హైస్కూల్ హెచ్‌ఎంలు హరినాథ్, నిరంజన్‌కుమార్, పీడీలు కరుణానిధి, శివకుమార్, ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

పకడ్బందీగా మోడల్ ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష


ప్రతిభా విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీవాణి

కల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి మోడల్ ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్ష పకడ్బందీగా నిర్వహించినట్లు హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. మండలంలో 35 మంది విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. వారందరికీ జిల్లా స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మోడల్ పరీక్ష నిర్వహించామన్నారు. ఈ పరీక్షలో పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్ 180 మార్కులకు 104 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచాడని వెల్లడించారు. 82 మార్కులతో కల్లూరు విద్యార్థి యస్రబ్ రెండవ స్థానం, 73 మార్కులతో విద్యార్థి సహస్రి మూడవ స్థానంలో నిలిచారని వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ నెల 8న జిల్లా కేంద్రంలో నిర్వహించే పరీక్షలో 35మంది విద్యార్థులూ ప్రతిభ కనబరిచి ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, రహమత్‌బాషా, గుర్రయ్య, దొరస్వామి పాల్గొన్నారు.

ఉధ్రుతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు


మంగళంపేట సమీపంలో ప్రవహిస్తున్న పెద్ద వంక

కల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం వాగులు, వంకలు ఉధ్రుతంగా ప్రవహిస్తున్నాయి. మంగళంపేట సమీపంలోని పెద్ద వంక ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుండగా దిగువ బెస్తపల్లి సమీపంలోని గంగమ్మ ఆలయం వద్ద ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. అనేక చెరువులు, కుంటలు నిండాయి. పెద్ద చెరువులు సైతం మొరవెత్తేందుకు సిద్ధంగా ఉన్నాయి. కాగా పలు పంటలు నీట మునిగాయి. మంగళవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఇళ్లను వదిలి బయటకు వచ్చారు. కాగా మండలంలోని చెరువులు, కుంటలు నిండడంతో పాటు పలు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలియజేశారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి: కంచర్ల


వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పంలోని భవిత కేంద్రంలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఎంఈవో మహబూబ్ బాషా, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకా నీటిలోనే వరి పంటలు

- 685 ఎకరాలలో నష్టం



ఓదులపేట సమీపంలో నీటిలో మునిగిన వరి

చౌడేపల్లె, డిసెంబరు3:(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు 685 ఎకరాల వరి పంట నీట మునిగినట్లు ఏవో జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని చారాల, దిగువపల్లె, పరికిదొన, పందిళ్లపల్లె, శెట్టిపేట, సింగిరిగుంట, పెద్దకొండామారి, దుర్గసముద్రంతో పాటు పలు పంచాయతీలలో వరి పంటలు నీటి మునిగినట్లు తెలిపారు. నీట మునిగిన వరి పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటే వరిలో మొలకలు రావన్నారు. పంట నష్టపోయిన రైతుల వివరాలు రైతు సేవా కేంద్రం ద్వారా నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వివరించారు.

ఆరోగ్యసంరక్షణపై అవగాహన

బైరెడ్డిపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఫెమి సంస్థ నిర్వాహకులు అనంతమునిరాజ, జయశ్రీ 'ఆరోగ్య సంరక్షణ - మన బాధ్యత' అనే అంశంపై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. యుక్తవయస్సు వచ్చిన బాలికలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, వ్యక్తిగత శుభ్రత తదితర అంశాల గురించి వివరించారు. ● బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాప్తి, లక్షణాలు, నివారణ, రక్తహీనత నివారణ, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలికల స్వీయరక్షణ గురించి వివరించారు.

చెరువులకు జలకళ


మొరవ పోతున్న పెద్ద చెరువు

చౌడేపల్లె, డిసెంబరు3: (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురిసి వర్షాలకు పలు చెరువులు నిండి మొరవలు పోతు న్నాయి. మంగళవారం మండలంలోని సింగిరిగుంట సమీపంలోని పెద్ద చెరువు, పరికిదొన పంచాయతీలోని గౌనివానిచెరువులు నిండి మొరవలు సాగుతున్నాయి. పెద్ద చెరువు మొరవ పోతుండటంతో సింగిరిగుంటకు చెందిన ఆయకట్టు రైతులు పూజలు చేశారు.

వర్షాలకు కూలిన ఇంటి గోడ



చౌడేపల్లె, డిసెంబరు3:(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు స్థానిక టీచర్స్ కాలనీలో ఉన్న నారాయణమ్మ ఇంటి మట్టి గోడ ఓ వైపు పూర్తిగా కూలింది. గోడ నిర్మించుకునేందుకు తనకు ఆర్థిక స్తోమత లేదని ప్రభుత్వం సాయం చేయాలని వేడుకుంటోంది. వీఆర్‌వోలు విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీపతి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వివరించారు.

7న పేరెంట్ టీచర్స్ మీటింగ్

రొంపిచెర్ల, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 7వతేదీన జరగనున్న పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని ఎంఈవోలు ఇందిర, శ్రీనివాసులు ఆహ్వానించారు. రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటానని చల్లాబాబు తెలియజేశారు. వారితోపాటు పులిచెర్ల ఎంఈవో తాతయ్య కూడా ఉన్నారు.

ప్రజా సమస్యలు గుర్తించండి

రొంపిచెర్ల, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు రోజులుగా కురిసిన వర్షాల వలన ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. శానిటేషన్, వాటర్‌ట్యాంక్‌లు శుభ్రం చేయాలన్నారు. పైపు లైన్ లీకేజిలు అరికట్టాలన్నారు.

తెగుళ్లపై అవగాహన



పుంగనూరు రూరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలకు ఆకుమాడు తెగుళ్ల సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి వరప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని భీమగానిపల్లె, సుగాలిమిట్ట తదితర గ్రామాల్లో సాగుచేసిన బంగాళదుంప, టమోటా పంటలను ఆయన పరిశీలించారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి

కల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే విధంగా బోధన చేయాలని ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల తెలుగు, గణితం ఉపాధ్యాయులకు టీఏఆర్‌ఎల్ శిక్షణా తరగతులు నిర్వహించారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులు తెలుగు, గణితంపై పట్టుసాధించేలా బోధన ఉండాలన్నారు. స్వచ్ఛంద సంస్థ అందజేసిన టీఏఆర్‌ఎల్ మెటీరియల్ ఉపయోగించే తీరును వివరించారు. టీఏఆర్‌ఎల్ జిల్లా సమన్వయ కర్త లోకనాథం, జోనల్ సమన్వయకర్త గోపి పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ ఉండాలి

బైరెడ్డిపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ వహించి వారు బాగా చదివేలా తీర్చిదిద్దాలని జిల్లా సమగ్ర శిక్ష ప్లానింగ్ కో-ఆర్డినేటర్ జయప్రకాష్ సూచించారు. బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణా తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ముఖ్యంగా 3, 4, 5 తరగతుల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి తగిన శిక్షణ అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా ఈనెల 7వ తేదీ మెగా పీటీఎం (పేరెంట్ టీచర్స్ మీటింగ్) నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 సుబ్రమణ్యం, జిల్లామాస్టర్‌ట్రైనర్ చైతన్యాచారి, రిసోర్స్ పర్సన్లు శశికుమార్, సురేఖ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

20 గ్రామాలకు రాకపోకలు కట్

జీఎంఆర్‌పురం వాగులో అధిక నీటి ప్రవాహమే కారణం

శ్రీరంగరాజపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలంలో కురుస్తున్న వర్షానికి మంగళవారం కాలువలు ఒక్కసారిగా పొంగాయి. జీఎంఆర్‌పురం వాగు ఉధ్రుతంగా రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో 20 గ్రామాలకు రాకపోకలు కట్ అయ్యాయి. ఈ వాగును టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంధమనేని రాజశేఖర్ నాయుడు పరిశీలించారు.


రోడ్డుపై పారుతున్న వాగు

కృష్ణాపురం జలాశయం రెండు గేట్లు ఎత్తివేత



వెదురుకుప్పం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయం గేట్లు రెండింటిని మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు నీటి పారుదలశాఖ వారు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. రిజర్వాయర్‌లోకి ఇన్ ఫ్లో-1500 క్యూసెక్కులు ఉంటే, అవుట్ ఫ్లో-2వేల క్యూసెక్కులని నీటి పారుదలశాఖ డీఈ మురళీకృష్ణ, ఏఈలు రవిప్రకాష్, భాస్కర్‌రాజు తెలిపారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు: కమిషనర్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు ఎక్కడా నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. కమిషనర్ ఆదేశాలతో ప్రజారోగ్య విభాగం అధికారులు వర్షపు నీరు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించారు.

చంద్రబాబు వస్తే కరువొస్తుందన్నారే ఇప్పుడేమంటారు: టీడీపీ


పాతపాళ్యం దళితవాడ వద్ద మొరవ పారుతుండగా గుమ్మడి కాయతో హారతి ఇస్తున్న కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అధికారంలోకి వస్తే కరువొస్తుందన్నవారు.. ఇప్పుడేమంటారని ప్రతిపక్షాలను పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమనాయుడు ప్రశ్నించారు. తూగుండ్రం చెరువు నిండిపోయి పాతపాళ్యం దళితవాడవైపు మొరవపారుతోంది. దీంతో మంగళవారం సాయంత్రం స్థానిక నేతలతో కలిసి గుమ్మడికాయతో హారుతులిచ్చి, పూజలు చేశారు. చిత్తూరు బాలాజి మొబైల్స్ షాపు యాజమాని యంప్రాల వెంకటేశులునాయుడు, నేతలు వెంకటేష్‌నాయుడు, రవి, ఫీల్డ్ అసిస్టెంట్ సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న గార్గేయనది



ఐరాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలో సోమవారం రాత్రి కురిసిన వర్షాలకు గార్గేయనది పొంగి పొర్లుతోంది. ఉదయం నుంచి అటవీప్రాంతంలో వర్షం కురుస్తుండటంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అప్రమత్తం అయిన ఐరాల పోలీసులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంకపైన రాకపోకలు జరగకుండా బారికేడ్లను పెట్టారు. సాయంత్రం వంకలో నీటి ప్రవాహం తగ్గడంతో రాకపోకలకు అనుమతిచ్చారు.

ఎన్టీఆర్ జలాశయం నుంచి నీరు విడుదల

పెనుమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలవగుంటలో ఉన్న ఎన్టీఆర్ జలాశయం నుంచి మూడు గేట్ల ద్వారా దిగువకు 250 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. పూతలపట్టు, ఐరాల మండలాల్లో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జలాశయానికి నీరు చేరడంతో దిగువకు నీరు విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఏఈ భరత్ తెలిపారు.

ఉధ్రుతంగా ప్రవహిస్తున్న నీవానది

కోతకు గురైన మట్టిరోడ్డు, తెగిపోయిన వంకదారి



ఏటిలో కోతకు గురైన మట్టిరోడ్డు - తెగిన వంకదారిని పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

గంగాధరనెల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జలాశయం నుంచి నీటిని కిందకు విడుదల చేయడంతో నీవానది ఉధ్రుతంగా ప్రవహిస్తోంది. పైగా యాదమరి, చిత్తూరు నగరానికి చెందిన వర్షపునీరు కూడా ఇదే నదిలో కలుస్తోంది. ఈ ప్రవాహం గంగాధరనెల్లూరు మీదుగా ఆత్మకూరు - నరసింగరాయనిపేట (చిత్తూరు మండలం) మీదుగా సాగుతోంది. దీంతో ఈ రెండు ప్రాంతాల్లోని ఏటిలోని మట్టిరోడ్డు కోతకుగురై ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. బాలగంగనపల్లె పంచాయతీ పరిధిలో అరవచేనుపల్లె - గొల్లపల్లెకు వెళ్లే రహదారిలో నీటి ఉధృతికి వంకదారి తెగిపోయింది. దీన్ని మంగళవారం ఉదయం గ్రామస్తులు, టీడీపీ నేతలతో కలిసి తహసీల్దార్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఇక తూగుండ్రంకు చెందిన ఎస్.నందగోపాల్ తన రెండు ఎకరాల్లో వేరుశనగ విత్తగా, ప్రస్తుతం నీరు చేరడంతో రూ.30వేల వరకు నష్టం వాటిల్లిందని తెలిపాడు. కర్ణారెడ్డి తన ఎకరా పొలంలోని వరి కోతకోసే సమయంలో నేలవాలి మొలకలు వచ్చే పరిస్థితి వచ్చిందని, సుమారు రూ.50వేల వరకు నష్టం జరిగిందని వాపోయాడు. ఈ పంటను నష్టాన్ని మండల వ్యవసాయాధికారి భవాని సిబ్బందితో కలిసి పరిశీలించారు. గంగాధరనెల్లూరు, తూగుండ్రం సబ్‌స్టేషన్ల పరిధిలోని వేర్వేరు గ్రామాల్లో ఏడు చోట్ల విద్యుత్ స్తంభాలు ధ్వంసమమయ్యాయి. ఇంకొన్నిచోట్ల చెట్ల కొమ్మలు పడి విద్యుత్ తీగలు తెగిపోయాయి. వీటన్నింటినీ బాగుచేశామని ఏఈలు వరదరాజులు, తనిగవేలు పేర్కొన్నారు.

నీట మునిగిన పంటలు

నగరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నగరి మండల పరిధిలోని కృష్ణారామాపురం గ్రామంలో పంటలన్నీ నీటమునిగి రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారు. చెరకు, వరి, మిరపచెట్లు, పూల, వంకాయతోటల్లో నీరు నిల్వ ఉందని రైతులు వాపోతున్నారు.


కుశస్థలీ నదిలో ప్రవహిస్తున్న నీరు



చెరకుతోటల, వరిపంటలోకి చేరిన వర్షపు నీరు

వాగులు, వంకల ప్రవాహం

● రాకపోకలకు అంతరాయం

వెదురుకుప్పం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలతో వెదురుకుప్పం మండలంలోని చెరువులన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. వెదురుకుప్పం-దేవళంపేట రహదారి మార్గంలోని తంగేలిమిట్ట సమీపంలో ఉన్న మధ్యల వంక వాగు మంగళవారం ఉదయం రోడ్డుపై ఉధ్రుతంగా ప్రవహించింది. దీనివల్ల వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగింది. బస్సులను కూడా ఆపేశారు. ప్రమాదకర పరిస్థితుల్లోనే బైకులపై వెళ్లేవారిని, విద్యార్థులను, పలువురు ప్రయాణికులను కూడా స్థానికులు వాగు దాటించారు. సుమారు మూడు గంటల తర్వాత వాగు ఉధ్రుతి తగ్గడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

ఉధ్రుతి తగ్గాక హెచ్చరిక జెండాలు

మధ్యల వంక వద్ద వాగు ఉధ్రుతి తగ్గాక వెదురుకుప్పం ఈవోపీఆర్డీ పురుషోత్తం, డిప్యూటీ తహసీల్దార్ కోమల, వీఆర్వో నరసింహారెడ్డి, గ్రామ సచివాలయ ఉద్యోగులు అక్కడికి చేరుకుని హెచ్చరిక జెండాలు కట్టారు. వెదురుకుప్పం మండల పరిధిలో 178 చెరువులు ఉంటే సుమారు 70 చెరువులు కలుజులు ప్రవహిస్తున్నాయి. ఈ నీరంతా కార్వేటినగరంలోని కృష్ణాపురం రిజర్వాయర్‌కు చేరింది. అలాగే కార్వేటినగరం మండలంలో కూడా వర్షాల కారణంగా చెరువులకు నీళ్లు చేరాయి.

బైక్‌దారుడిని వాగు దాటిస్తున్న స్థానికులు



మధ్యల వంక వాగు ప్రవాహంతో ఆగిన బస్సు

వృద్ధురాలిని ఇంటికి చేర్చిన 'అమ్మఒడి'



చిత్తూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకు చెందిన రత్నమ్మ(82)ను గత నెల 21వ తేదీన ఆమె మనవడు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి వెళ్లిపోయాడు. అప్పటినుంచి తిరిగి రాలేదు. ఆస్పత్రి సిబ్బంది ఈ విషయాన్ని అమ్మఒడి నిర్వాహకుడు పద్మనాభనాయుడికి తెలిపారు. ఆయన వృద్ధురాలి చిరునామా తెలుసుకుని మంగళవారం ఆమెను వారి కుటుంబీకులకు అప్పగించారు.

అధ్యాపకులకు అభినందన



చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ నిర్వహించిన అంతర్ కళాశాలల అధ్యాపక క్రీడా పోటీల్లో డబుల్స్ బ్యాడ్మింటన్‌లో పీవీకేఎన్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రతిభ చూపారు. పీడీ లోకేష్, లైబ్రేరియన్ శ్రీకాంత్‌లు ప్రథమ స్థానంలో నిలవడంతో వీరిని కళాశాల ప్రిన్సిపాల్ జీవన జ్యోతి, సహ అధ్యాపకులు అభినందించారు.

ఐరాల విద్యార్థికి అవార్డు



ఐరాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండల వాసికి ఇంటర్నేషనల్ ఐకాన్ అవార్డు లభించింది. 45కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ బాలాజీ కుమారుడు హరీష్ చిత్తూరు విజయం బిజినెస్ స్కూల్లో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'యువజన సంఘం' కార్యక్రమంలో జిల్లా నుంచి పాల్గొన్నాడు. ఈ సందర్భంగా హరీష్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్సు వారు గుర్తించి అవార్డును ప్రదానం చేశారు.

గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐగా శ్రీనివాసంతి

గంగాధరనెల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐగా కనావత్ శ్రీనివాసంతి మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ ఆదేశాలతో డీటీఆర్‌బీలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తుండిన లక్ష్మీనారాయణకు వీఆర్‌కు పంపారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

బంగారుపాళ్యం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ముందస్తు సమాచారంతో కేజీ సత్రం సమీపంలో పేకాడుతున్న వారిపై దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో.. గాజులపల్లెకి చెందిన హమీద్ బాషా, ఉత్తరబ్రాహ్మణపల్లెకి చెందిన పృథ్వీరాజ్, చిల్లగుండ్లపల్లెకి చెందిన గోవిందు, మణి, వావిల్‌తోటకు చెందిన వినాయకం ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.27,900 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

24మందికి రూ.2.40 లక్షల జరిమానా

చిత్తూరు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 24 మందికి రూ.2.40 లక్షల జరిమానా విధిస్తూ జూనియర్ కోర్టు జడ్జి ఉమాదేవి ఆదేశాలు ఇచ్చారు. సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. 24 మంది మద్యం తాగినట్లు గుర్తించి, వారిపై కేసు నమోదు చేశారు. వీరిని మంగళవారం జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పరిచారు. విచారించిన న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఒక్కోసారి జరిమానాతోపాటు జైలుశిక్ష కూడా పడుతుందని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు.

పదవీ విరమణ సన్మానం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీలో ఎస్ఐగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన వెంకటరమణకు పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందినా మనమంతా ఒకే కుటుంబమని అన్నారు. ఎంటీవో భాస్కర్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



కోసలనగరాన్ని పారిశ్రామికవాడగా అభివృద్ధి చేయాలి

● సీఎంకు భానుప్రకాష్ విజ్ఞప్తి



విజయపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోసలనగరాన్ని పారిశ్రామికవాడగా అభివృద్ధి చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి విన్నవించారు. అలాగే తన నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలన్నారు. పుత్తూరు ఆస్పత్రి స్థాయిని 100 పడకలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై సీఎం సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

'జేఎంసీ' బకాయిలు విడుదల చేయండి

సీఎంకు తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు విజ్ఞప్తి - సీఎం పేషీనుంచి కదిలిన ఫైల్

తిరుపతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్ పేరిట చేసిన కాంట్రాక్టు పనులకు రూ32.78 కోట్ల బిల్లులు రాలేదని, వాటిని ఇప్పించాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఆమేరకు గత నెల 21న సీఎం చంద్రబాబును లిఖితపూర్వకంగా కోరారు. రోడ్లు-భవనాలు (రూ13.58 కోట్లు), పంచాయతీరాజ్ శాఖ (రూ19.20కోట్లు)కు సంబంధించిన మరమ్మతులు, ప్యాచ్ వర్క్ చేసిన బిల్లులు గత మూడేళ్లుగా అందలేదని పేర్కొన్నారు. జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్‌పై దాదాపు 500 మంది ఉద్యోగులు ఆధారపడి ఉన్నారని, బకాయి నిధులు విడుదల చేయాలని కోరారు. ఆరణి శ్రీనివాసులు చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనకు సంబంధించిన జేఎంసీ సంస్థ నుంచి పెద్దఎత్తున కాంట్రాక్టు పనులు చేపట్టారు. అప్పటి బకాయిలను ఇప్పుడు విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఫైలు చిత్తూరుకు వచ్చినట్టు తెలిసింది.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

శ్రీరంగరాజపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాతపాళ్యం దళితవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా దళితుల పోరాట హక్కుల సమితి నేత దామోదరం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం 49.కొత్తపల్లె మిట్టలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని.. కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రఘు, 49.కొత్తపల్లె అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులు, దళిత నాయకులు పాల్గొన్నారు.


కళ్లకు గంతలు కట్టుకుని కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

ప్రజలపై భారం మోపొద్దు: మాజీ ఎమ్మెల్యేలు

బంగారుపాళ్యం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై భారం మోపొద్దని కూటమి ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్ కుమార్, లలిత కుమారి సూచించారు. మంగళవారం మాజీ జడ్పీ చైర్మన్ కుమార్‌రాజా స్వగృహంలో ఆయనతోకలిసి మీడియాతో మాట్లాడారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలను పెంచడం సరికాదన్నారు. నేతలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, దత్తిరెడ్డి, కృష్ణమూర్తి, ప్రకాష్ రెడ్డి, కామరాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న సునీల్‌కుమార్, లలితకుమారి

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ తెలిపారు. మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. మేయర్ అముద మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అనంతరం పది మంది విభిన్న ప్రతిభాంతులకు టచ్ ఫోన్లను, నలుగురికి హియరింగ్ హెడ్‌లను అందించారు. ఏడీ శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

నగరి: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో భవానిశంకరి, ఎంపీడీవో సతీష్, ఎంఈవో శ్రీదేవి, సీడీపీవో కృష్ణవేణి, దివ్యాంగుల నాయకుడు కేశవన్, దివ్యాంగులు పాల్గొన్నారు.

యాదమరి: ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వేణు, ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, ఐవోసీఎల్ సంస్థ మేనేజర్ చైతన్య, దివ్యాంగులు పాల్గొన్నారు.

పెనుమూరు: ఎమ్మార్సీలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌నాయుడు, హైస్కూల్ హెచ్‌ఎం వెంకటేశులునాయుడు, పద్మజనాయుడు, దివ్యాంగులు, పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరరావు, ఏఎస్వో నరోత్తం, ఎంఈవో-2 రమేష్ బాబు, భార్గవ్ రావు, దివ్యాంగులు పాల్గొన్నారు.


యువతికి టచ్ ఫోన్‌ను అందజేస్తున్న హిమవంశీ

నగరి కాపు సంఘం అధ్యక్షుడిగా బాబు



నగరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గం జాతీయ కాపు సంఘం అధ్యక్షుడిగా ఎంపీ బాబు నియమితులయ్యారు. దీనికి సంబంధించిన ఉత్తర్వును జాతీయ కాపుసంఘం కార్యదర్శి గోపీరాయల్ అందించారు. ఈ సందర్భంగా బాబును పలువురు సన్మానించారు.

'సంకల్ప'ను పక్కాగా అమలు చేయాలి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో అభ్యాసనా సామర్థ్యాలను పెంచడానికి ప్రవేశపెట్టిన 'సంకల్ప'ను పక్కాగా అమలు చేయాలని డీవీఈవో సయ్యద్ మౌల అన్నారు. మంగళవారం బీఎస్ కన్నన్ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన సంకల్పలోని స్టడీ అవర్‌లో విద్యార్థుల్లో మాట్లాడారు. అనంతరం అధ్యాపకులకు పలు సూచనలు ఇచ్చారు.

టీడీపీ నాయకుడికి భరోసా



వెదురుకుప్పం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీ పేట పంచాయతీ ఇందిరాకాలనీకి చెందిన టీడీపీ నాయకుడు దామోదరం(55) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మంగళవారం ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. మండల యువత ప్రధాన కార్యదర్శి ఢిల్లీబాబురెడ్డి, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చెంగ్రాలయులు, నాయకులు నాగభూషణంరెడ్డి, ముని ఉన్నారు.

పీఆర్టీయూ యాదమరి కార్యవర్గం



శివప్రసాద్ - మోహన్ కుమార్

యాదమరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ యాదమరి మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఎన్నుకున్నారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ఏకగ్రీవమైంది. మండల అధ్యక్షుడిగా ఎ.శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె.మోహన్ కుమార్, గౌరవాధ్యక్షుడిగా బి.సురేష్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా ఆనంద పిళ్ళై, హరికృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా విశ్వనాథ్, మండల మహిళా ఉపాధ్యక్షురాలిగా కాంచన, కార్యదర్శులుగా లతా రమణి, సరస ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా జె.భాస్కర రెడ్డి వ్యవహరించారు.

రాఘవేంద్రస్వామికి పూజలు



చిత్తూరు కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జెండామాను వీధిలోని మంత్రాలయ రాఘవేంద్ర స్వామికి సంస్థాన పూజలను ఉడిపి పీఠాధిపతి విశ్వ ప్రసన్న తీర్థులు మంగళవారం నిర్వహించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని భక్తులకు తెలిపారు. మఠం నిర్వాహకులు పాల్గొన్నారు.

నేటినుంచి న్యాయవాదుల విధుల బహిష్కరణ

చిత్తూరు లీగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి తదితర కేసులకు సంబంధించిన కోర్టును చిత్తూరు నుంచి తిరుపతికి తరలించే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని చిత్తూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాజేంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్ ఒక ప్రకటనలో కోరారు. ఇక్కడ ఉండే ఫస్ట్ ఏడీజే కోర్టులో జరిగే కేసులను తిరుపతికి తరలిస్తే కక్షిదారులు ఇబ్బంది పడతారన్నారు. దీనికి నిరసనగా బుధవారం నుంచి మూడ్రోజులపాటు విధులు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

పాలూరు బ్రిడ్జి నుంచి పడిన కారు



చిత్తూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలం పాలూరు గ్రామం వద్ద ఉన్న బ్రిడ్జి నుంచి ఓ కారు సోమవారం రాత్రి కిందపడింది. భారీ శబ్దం రావడంతో స్థానికులు అక్కడికెళ్లారు. కారు బ్రిడ్జి కింద నీటిలో పడి ఉండటం చూసి.. 108కు ఫోన్‌చేయగా వారొచ్చి వాహనంలోని వారిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారులోని వారంతా స్వల్ప గాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై కేసు నమోదు కాలేదని బీఎస్‌ఆర్‌పేట పోలీసులు తెలిపారు.

సంక్షిప్తంగా..

రైతులను ఆదుకోవాలి: సీపీఐ

చిత్తూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చాలా మూగజీవాలు కూడా మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదల గుడిసెలు కూలిపోయి ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

యూపీహెచ్‌సీలో తనిఖీలు

చిత్తూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాపాక్షి యూపీహెచ్‌సీని మంగళవారం డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆశా కార్యకర్తలకు పలు సూచనలు ఇచ్చారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు

గుడిపాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో శివరాజు అన్నారు. మంగళవారం కార్యదర్శులతో మాట్లాడారు. ఇంటింటి జియోట్యాగింగ్‌ను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.

తవణంపల్లెలో అసిస్టెంట్ కలెక్టర్

తవణంపల్లె, డిసంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శిక్షణ పొందుతున్న అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ మంగళవారం తవణంపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై తహసీల్దార్ సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

వెదురుకుప్పం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలయ్యపల్లె పంచాయతీ వేణుగోపాలపురంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బీఎం రవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

వెదురుకుప్పం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో అమరనాథ్ అన్నారు. మంగళవారం బ్రాహ్మణపల్లె సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈవోపీఆర్డీ పురుషోత్తం, డీడీవో రమేష్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంటు విష్ణువర్థన్‌రెడ్డి పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన మాజీ ఎంపీపీ



పెనుమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-పెనుమూరు రోడ్డు పలుచోట్ల గుంతలతో అధ్వానంగా తయారైంది. దీనివల్ల రోజూ ప్రమాదాలు జరుగుతుండటంతో మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు తన టిప్పర్‌లతో మట్టిని తోలి గుంతలను పూడ్చారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.